క్లుప్తంగా

జాతర ప్రాంగణం సందర్శన



మనాలిఠాకూర్‌ను సన్మానిస్తున్న జాతర కమిటీ

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని గోలివాడ గోదావరి నది ఒడ్డున 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్న సమ్మక్క, సారలమ్మ జాతర ప్రాంగణాన్ని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ సతీమణి మనాలిఠాకూర్ సందర్శించారు. ఈ సందర్భంగా జాతర ఏర్పాట్లపై కమిటీతో పాటు సంబంధిత అధికారులను అడిగి తెలుసుకొన్నారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పలు సూచనలు, సలహాలిచ్చారు. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే సతీమణిని జాతర కమిటీ తరఫున సన్మానించారు. కమిటీ చైర్మన్ పెండ్రు హన్మాన్‌రెడ్డి, ప్రతినిధులు చెన్నూరి వేణు, ఆవుల గోపాల్‌యాదవ్, కోల రామ్మూర్తిగౌడ్, తమ్మనవేణి కొంరెల్లి, మడ్డి తిరుపతిగౌడ్, వెంకటేశ్‌గౌడ్, మండల వైద్యాధికారి డాక్టర్ ఉదయ్‌కుమార్, సిబ్బంది సురేశ్ వర్మ, లలిత ఉన్నారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో శంకర్

కమాన్‌పూర్: మండలంలోని గుండారం గ్రామంలో ఈ నెల 21 నుంచి జరిగే సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లను శనివారం మంథని డీఎల్‌పీవో ఆటకాపురం శంకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ జాతర జరిగే ప్రాంతంతో పాటు తాగునీటి సరఫరా చేసే ట్యాంకుల్లో బ్లీచింగ్ పౌడర్‌తో క్లోరినేషన్ చేసి పరిశుభ్రంగా ఉంచాలన్నారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఎంపీవో శేషయ్య సూరి, జాతర కమిటీ చైర్మన్ పిడుగు శంకర్ ఉన్నారు.

సింగరేణి సీఎండీని కలిసిన శ్యాం



పెద్దపల్లిరూరల్: కోల్ ఇండియా ప్రిన్సిపల్ సెక్రటరీ అమృత్‌లాల్ మీనా, సింగరేణి సీఎండీ బలరాంనాయక్‌ను టీపీసీసీ కార్యదర్శి పెర్క శ్యాం శనివారం కలిశారు. కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

కమాన్‌పూర్: మండలంలోని గుండారం గ్రామంలో రూ.80వేలతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను శనివారం ఎంపీపీ రాసకొండ లక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో దేవరకొండ ఉమేశ్, పంచాయతీ కార్యదర్శి గర్రెపల్లి నరేశ్, నాయకులు రాసకొండ రవి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు

పాలకుర్తి: మండలంలోని మంథని నియోజకవర్గ పరిధిలోని జీడీనగర్, కన్నాల, బామ్లానాయక్‌తండా, రాణాపూర్ గ్రామాల అభివృద్ధికి రూ.89లక్షల నిధులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంజూరు చేసినట్లు డీసీసీ ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య తెలిపారు. కన్నాల గ్రామానికి రూ.34లక్షలు, బామ్లానాయక్‌తండాకు రూ.10లక్షలు, రాణాపూర్ గ్రామానికి రూ.15లక్షలు, జీడీనగర్ గ్రామానికి రూ.30లక్షలు నిధులు కేటాయించినట్లు సమ్మయ్య వెల్లడించారు. కాగా గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించిన మంత్రికి ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆకట్టుకున్న కళాజాత

ఎలిగేడు: మండల కేంద్రంలోని జీపీ కార్యాలయం సమీపంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం సభ్యులతో నిర్వహించిన కళాజాత ప్రదర్శన గ్రామస్తులను ఆకట్టుకుంది. యువత చెడు వ్యసనాల జోలికి పోకుండా సన్మార్గంలో పయనించాలని సూచించారు. బేటీ బచావో, బేటీ పడావో, ప్రభుత్వం అందిస్తున్న ఆరు గ్యారంటీ పథకాలపై కళా ప్రదర్శన ద్వారా వివరించారు. సాంస్కృతిక సారథి కళాకారులు జనగామ రాజనర్సు, ఈదునూరి పద్మ, కొండ్ర వెంకన్నగౌడ్, ఇల్లందుల మల్లేశ్‌గౌడ్, సాయిల్ల శ్రీనివాస్, జిన్న రమ, సలేంద్ర రాజన్న, కన్నూరి రేణుక, కట్కూరి శ్రీవల్లి పాల్గొన్నారు.

అంధత్వ నివారణకు చర్యలు

- తొమ్మిది నెలల నుంచి 5ఏళ్ల పిల్లలకు విటమిన్ ఎ సిరప్
- 13వ తేదీ నుంచి 29 వరకు పంపిణీ
- జిల్లాలో ఉన్న చిన్న పిల్లలు 60,746



విటమిన్ ఎ సిరప్ వేస్తున్న ఏఎన్‌ఎం

సుల్తానాబాద్: చిన్నారుల్లో వ్యాధి నిరోధకశక్తి పెంచి కంటి సమస్యలను నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా పిల్లలకు విటమిన్ ఎ సిరప్‌ను ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు పంపిణీ చేస్తున్నారు. ఈ నెల 13వ తేదీ నుంచి 29వ తేదీ వరకు వైద్యఆరోగ్యశాఖ స్పెషల్ డ్రైవ్ చేపట్టింది.

జిల్లాలో 5ఏళ్లలోపు పిల్లలు..

జిల్లాలో 18 పీహెచ్‌సీలు, 8 అర్బన్ పీహెచ్‌సీలు, 266 గ్రామపంచాయతీలు ఉండగా ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులతో పాటు బయట ఉన్న పిల్లలను గుర్తించి విటమిన్ ఎ సిరప్‌ను అందిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 9 నెలల నుంచి 5ఏళ్ల పిల్లలు 60,746 మంది ఉన్నారు. ఇప్పటివరకు విటమిన్ ఎ సిరప్‌ను 20,821మందికి అందజేశారు.

కంటికి ప్రయోజనం

ఈ సిరప్ వేయడం ద్వారా కళ్లకు ప్రధానంగా రేచీకటి, కంటిలో మచ్చలు బిటాట్ స్పాట్స్ ముందుగానే నివారించవచ్చు. అమ్మతల్లి, చికెన్‌ఫాక్స్‌కు సంబంధించిన అనారోగ్యాల నివారణకు సమర్థంగా పనిచేస్తుంది. విటమిన్ ఎ ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలు తాజా ఆకుకూరలు, మామిడి, బొప్పాయి పండ్లు, క్యారెట్, గుమ్మడికాయ, పాలు, వెన్న, నెయ్యి చిన్నప్పటి నుంచి అలవాటు చేయాలి. అన్ని టీకాలు సరైన సమయంలో అందించాలని వైద్యులు చెప్తున్నారు. చిన్నారులకు విటమిన్ సి ఉన్న పండ్లు, ఆకుకూరలు తినిపించాలని డాక్టర్లు సూచిస్తున్నారు.

విటమిన్ ఎ సిరప్..

9 నెలల నుంచి ఐదేళ్లలోపు పిల్లలందరికీ ఆరునెలలకు ఒకసారి విటమిన్ ఎ సిరప్ తాగించాలి. జిల్లాలో ఈ వయస్సున్న చిన్నారులు 60,746 మంది ఉన్నారు. ఈ సిరప్ వైద్యారోగ్యశాఖ, అంగన్‌వాడీ కేంద్రాల్లో మాత్రమే ఉంటుంది. చిన్నారులకు వ్యాధి నిరోధక టీకా వేసేటప్పుడు పిల్లలకు అందజేస్తారు. ఈ సిరప్ ఇచ్చి ఒక నెల పూర్తయితే మళ్లీ తాగించవచ్చు.

ప్రతీ బుధ, శనివారాల్లో అందిస్తారు



విటమిన్ ఎ సిరప్ గ్రామంలో, పట్టణాలలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అందిస్తున్నారు. ఇప్పటి వరకు 20,821 మందికి వేశారు. 9 నుంచి 12 నెలల వయస్సు చిన్నారులకు 1 మి.లీ, 16 నెలల నుంచి 5ఏళ్ల పిల్లలకు 2 మి.లీ చొప్పున ద్రావణం అందిస్తున్నాం. జ్వరం, దగ్గు, జలుబు ఉంటే వేయకూడదు. ఆరోగ్యకేంద్రాలు ప్రతీ బుధవారం, శనివారం అందిస్తారు.

– డా.ప్రమోద్‌కుమార్, జిల్లా వైద్యాధికారి, పెద్దపల్లి

ఇబ్బందులు లేకుండా జాతర నిర్వహించాలి

గోదావరిఖని: సమ్మక్క–సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని గోదావరిఖని ఏసీపీ ఎం.రమేశ్ సూచించారు. శనివారం జాతర ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. జాతర ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు, కమిటీ సభ్యులు సహకరించాలని కోరారు. పోలీస్ సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ జాతరలో ఇబ్బందులు లేకుండా, ట్రాఫిక్ క్రమబద్ధీకరించాలన్నారు. గోదావరిఖని వన్‌టౌన్, టూటౌన్ సీఐలు ప్రమోద్‌రావు, ప్రసాదరావు ఉన్నారు.

అంతర్గాం పోలీస్‌స్టేషన్ సందర్శన

రామగుండం: అంతర్గాం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను శనివారం గోదావరిఖని ఏసీపీ ఎం.రమేశ్ ఆకస్మికంగా సందర్శించారు. ప్రజలు ఇచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి న్యాయం చేయాలని ఆదేశించారు. ఎస్సై బోయ వెంకట్, రామగుండం సీఐ టి.ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

గోలివాడ జాతర ప్రాంతం పరిశీలన



రామగుండం: సూచనలు చేస్తున్న ఏసీపీ రమేశ్

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని గోలివాడ సమ్మక్క జాతర ప్రాంగణాన్ని శనివారం ఏసీపీ ఎం.రమేశ్ సందర్శించారు. జాతర కమిటీ ప్రతినిధులతో చర్చించి సూచనలు, సలహాలిచ్చారు. రామగుండం సీఐ టి.ప్రవీణ్‌కుమార్, అంతర్గాం ఎస్సై బోయ వెంకట్, తహసీల్దార్ పనకంటి రామ్మోహన్‌రావు, జాతర కమిటీ చైర్మన్ పెండ్రు హన్మాన్‌రెడ్డి, కోల రామ్మూర్తిగౌడ్, ఆవుల గోపాల్‌యాదవ్ ఉన్నారు.

సౌకర్యాలు కల్పించాలి

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని గోదావరి నది ఒడ్డున సమ్మక్క–సారలమ్మ జాతర నిర్వహణ కోసం చేపడుతున్న ఏర్పాట్లను శనివారం నగరపాలక సంస్థ మేయర్ బంగి అనిల్‌కుమార్ పరిశీలించారు. భక్తులకు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. జాతర కమిటీ సభ్యులతోపాటు అధికారులతో మాట్లాడి ఏర్పాట్ల తీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్లు బాలరాజ్‌కుమార్, కన్నూరి సతీశ్‌కుమార్, నాయకులు పాతిపెల్లి ఎల్లయ్య, దీటి బాలరాజ్‌కుమార్, కత్తెరమల్ల రమేశ్, గణేశ్, జె.విశ్వతేజ తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మేయర్ అనిల్‌కుమార్

క్రైస్తవులపై దాడిని ఖండిస్తున్నాం

గోదావరిఖని: రంగారెడ్డి జిల్లా జువాడీ ప్రాంతంలో క్రైస్తవులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని పెద్దపల్లి జిల్లా పాస్టర్ల సంఘం పేర్కొంది. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం నిందితులను అరెస్ట్ చేయాలని కోరారు. పాస్టర్లు మహిపాల్‌రెడ్డి, డిలైట్, ప్రహర్షి, సోలోమెన్‌రాజు, గాబ్రియల్ పాల్గొన్నారు.

ట్రినిటి విద్యార్థుల ఇండస్ట్రియల్ విజిట్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాఘవాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను శనివారం ట్రినిటి డిప్లొమా ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విద్యార్థులు సందర్శించారు. సబ్‌స్టేషన్ నిర్వహణ, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుపై అవగాహన పెంచుకున్నారు. విద్యుత్‌శాఖ డీఈ బాలయ్య, ఏడీఈ ప్రభాకర్, సంజీవయ్య, ఏఈ శ్రీనివాస్ విద్యార్థులకు పవర్ డిస్ట్రిబ్యూషన్, ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరు, బ్రేకర్‌ల వినియోగం గురించి వివరించారు.

సంక్షిప్త వార్తలు

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపిక

పెద్దపల్లిరూరల్: రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శన పోటీలకు జిల్లా నుంచి ఏడు వినూత్న ఆవిష్కరణలు ఎంపికయ్యాయని జిల్లా విద్యాధికారి మాధవి తెలిపారు. ఈ మేరకు ఆన్‌లైన్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థుల వివరాలను శనివారం వెల్లడించారు.

కేంద్ర పథకాలపై గ్రామాల్లో అవగాహన

మంథని: మంథని మండలం గుంజపడుగు గ్రామంలో బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి జాడి బాలరెడ్డి పీఎం నరేంద్ర మోదీ పాలనలో కేంద్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు.

చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు

పాలకుర్తి: అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని బసంత్‌నగర్ ఎస్సై స్వామి అన్నారు. ఇటీవల గోదావరిఖని నుంచి బదిలీపై వచ్చిన ఎస్సై స్వామి బాధ్యతలు స్వీకరించిన అనంతరం శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

బసంత్‌నగర్‌లో వీధికుక్కల పట్టివేత

పాలకుర్తి: మండలంలోని బసంత్‌నగర్‌లో శనివారం వీధికుక్కల పట్టివేత కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాల ప్రారంభ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీకి స్థానికంగా కుక్కలబెడద తీవ్రంగా ఉందని గ్రామస్తులు విన్నవించారు. స్పందించిన అడిషనల్ కలెక్టర్ చర్యలు చేపట్టాలని గ్రామ ప్రత్యేకాధికారి షబ్బీర్‌పాషా, కార్యదర్శి నరేశ్‌ను ఆదేశించారు. కాగా ఏపీలోని నెల్లూరుకు చెందిన ప్రత్యేక బృందానికి స్థానిక అధికారులు సమాచారం ఇచ్చారు. కాగా వారు గ్రామంలోని దాదాపు 50 కుక్కలను ప్రత్యేక పద్ధతిలో పట్టుకుని ఆటో ట్రాలీ ద్వారా దూర ప్రాంతానికి తీసుకెళ్లి వదిలిపెట్టారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

సుల్తానాబాద్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. ఎస్సై వినీత తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తానాబాద్ మండలంలోని కనుకుల గ్రామానికి చెందిన బొంగోని శ్రీనివాస్–సులోచన దంపతుల రెండో కుమారుడు అజయ్(19) పెద్దపల్లిలో ఐటీఐ చదువుతున్నాడు. శనివారం బైక్‌పై పని నిమిత్తం సుల్తానాబాద్ వస్తున్నాడు. అదే సమయంలో ఓ వ్యాన్ సుల్తానాబాద్ నుంచి కాల్వశ్రీరాంపూర్ వైపు వెళ్తోంది. సుద్దాల శివారులోని పెట్రోల్ బంక్ సమీపంలో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో అజయ్ తలకు, కుడి కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నిరాధార ఆరోపణలు చేస్తే సహించేది లేదు

రామగుండం: నిధులు దుర్వినియోగం చేశామంటూ తమపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని పెద్దంపేట మాజీ సర్పంచ్ మేర్గు భాగ్యమ్మ, ఉపసర్పంచ్ కోడిపుంజుల భూమేశ్ అన్నారు. శనివారం అంతర్గాం ప్రెస్ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల నిధులు దుర్వినియోగం చేశారంటూ కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ ప్రతినిధులు మేర్గు నరేశ్‌గౌడ్, పల్లె శ్రీనివాస్, పైడిపెల్లి వెంకటస్వామి, వేగోళపు వెంకటస్వామి ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. స్పందించిన మాజీ ప్రజాప్రతినిధులు డబ్బుల కోసం డిమాండ్ చేయగా తాము పట్టించుకోకపోవడంతో తమపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, ఇప్పటికే తొలిసారి అందిన షోకాజ్ నోటీసుకు గతంలోనే సమాధానమిచ్చామన్నారు. మరోసారి తమపై అసత్య ఆరోపణలు చేస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయించి పరువు నష్టం దావా వేస్తామని పేర్కొన్నారు.

నిరుపేదకు ఇల్లు బహూకరణ



ఇల్లు బహూకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే చందర్

రామగుండం: మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ విలేజి అంతర్గాంకు చెందిన నిరుపేద వృద్ధురాలు కాంపెల్లి ఎల్లమ్మకు ఇల్లు కట్టించి బహూకరించారు.

న్యాయవాద దంపతులకు నివాళి



నివాళి అర్పిస్తున్న న్యాయవాదులు

మంథని: రామగిరి మండలం కల్వచర్ల సమీపంలో హత్యకు గురైన హైకోర్టు న్యాయవాద దంపతులు గట్టు నాగమణి–వామన్‌రావు మూడో వర్ధంతి సందర్భంగా న్యాయవాదులు నివాళి అర్పించారు. శనివారం మంథనిలోని బార్ అసోసియేషన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో నివాళి అర్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్నె హరిబాబు, న్యాయవాదులు చంద్రుపట్ల రమణకుమార్‌రెడ్డి, బొట్ల ఆంజనేయులు, కట్కం శ్రీనివాస్, ఉప్పు సుభాష్, రాచర్ల రాజేందర్, ఆర్ల నాగరాజు, శశిభూషణ్ కాచే, ఇరుగురాల సంతోష్, సతీశ్ ఉన్నారు.

మంథని: హైకోర్టు న్యాయవాద దంపతులు గట్టు నాగమణి–వామన్‌రావు వర్ధంతి సందర్భంగా శనివారం రాత్రి మంథని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రజా సంఘాలు, కాంగ్రెస్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు.

ఈ నెల 20లోగా దరఖాస్తులివ్వండి

పెద్దపల్లిరూరల్: మార్చి8న నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం అవార్డులను ప్రదానం చేస్తుందని, అర్హులు ఈనెల 20లోగా దరఖాస్తు సమర్పించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కోరారు. వివరాలకు మహిళా, వయోవృద్ధుల, దివ్యాంగులసంక్షేమ శాఖ (రూం నెంబర్ 114) లోని కార్యాలయంలో, సెల్ 94408 52495 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

కళాశాలలో వీడ్కోలు వేడుక

ధర్మారం: మండల కేంద్రంలోని సాధన జూనియర్ కళాశాలలో శనివారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రథమ సంవత్సరం విద్యార్థులు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గజనవేని కుమార్, ఎస్సై2 అశ్విని, ఏఎస్సై రషీద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు, గర్భిణులపై సర్వే



అవగాహన కల్పిస్తున్న మెడికల్ విద్యార్థులు

కమాన్‌పూర్: కమాన్‌పూర్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జూలపల్లిలో గోదావరిఖనిలోని ప్రభుత్వ సిమ్స్ మెడికల్ కళాశాల విద్యార్థులు శనివారం అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామంలో గర్భిణులపై సర్వే నిర్వహించారు. 2022–23 ద్వితీయ సంవత్సరం విద్యార్థులు గ్రామంలో క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రతలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరిగే నార్మల్ డెలివరీలు, ఆపరేషన్‌లపై అవగాహన కల్పించారు. హెచ్‌వోడీ డాక్టర్ శ్రీదేవి, సీహెచ్‌వో ప్రతాప్‌రెడ్డి, రవీందర్, నాగార్జున, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాగింగ్ అనేది విష సంస్కృతి



మాట్లాడుతున్న జడ్జి టి.శ్రీనివాసరావు

గోదావరిఖనిటౌన్: ర్యాగింగ్ అనేది విష సంస్కృతి అని, ర్యాగింగ్‌తో మంచి భవిష్యత్ ఉన్న విద్యార్థుల జీవితాలు బుగ్గిపాలు అవుతున్నాయని గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఉషోదయ పాఠశాలలో శనివారం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడ చక్రపాణి, న్యాయవాదులు గుర్రం నారాయణ, బాస అనురాధ, హెచ్‌ఎం కొత్త శ్రీనివాస్‌రెడ్డి, లోక్ అదాలత్ సోషల్ వర్కర్ శంకర్, లీగల్ వలంటీర్ సుజాత పాల్గొన్నారు.

ఆధునిక యంత్రాలను వినియోగంలోకి తేవాలి



యంత్రాలను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీకాంత్

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థలో పారిశుధ్య నిర్వహణ కోసం రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసి నిరుపయోగంగా ఉన్న అత్యాధునిక యంత్రాలు, వాహనాల గురించి శనివారం విధుల్లో చేరిన మున్సిపల్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ వివరాలు సేకరించారు. స్థానిక గౌతమినగర్‌లోని పొడి చెత్త సేకరణ కేంద్రం (డీఆర్‌సీసీ) కేంద్రాన్ని కమిషనర్ స్వయంగా పరిశీలించారు. నిరుపయోగంగా చెత్తలో పడేసిన రూ.70లక్షలతో కొనుగోలు చేసిన స్టాటిక్ కంపాక్టర్లు, రూ.45లక్షలతో కొనుగోలు చేసిన హుక్‌లోడర్ ట్రక్ వాహనంతో పాటు రూ.39లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన ప్లాస్టిక్ కోర్–వేస్ట్ డెస్ట్రక్షన్ సిస్టమ్ తదితర యంత్రాలను నేరుగా పరిశీలించారు. అత్యాధునిక యంత్రాలను వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావు, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మధుకర్ తదితరులు ఉన్నారు.

రిజిస్టర్డ్ కాంట్రాక్టర్లకే టెండర్లు అప్పగించండి



వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్టర్లు

కోల్‌సిటీ: రిజిస్టర్డ్ కాంట్రాక్టర్లకు మాత్రమే అన్ని రకాల అభివృద్ధి పనుల టెండర్లు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లోని సివిల్ కాంట్రాక్టర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్‌కు కాంట్రాక్టర్లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు కమిషనర్‌కు వారి సమస్యలు విన్నవించారు. రిజిస్టర్డ్ కాంట్రాక్టర్లు టెండర్ల ద్వారా సివిల్ పనులు చేసినప్పటికీ, ఏళ్ల తరబడి బిల్లులు ఇవ్వడానికి జనరల్ ఫండ్‌లో డబ్బు నిల్వ లేదని చెప్తూ బిల్లులు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రిజిస్టర్డ్ కాంట్రాక్టర్లకు జనరల్ ఫండ్ నుంచి క్రమపద్ధతిన బిల్లులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కాంట్రాక్టర్లు కృపాకర్‌రావు, రజినీకాంత్, సదానందం, మహేందర్‌గౌడ్, తిరుపతి, నవీన్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు



గోదావరిఖని: కేక్ కట్ చేస్తున్న చందర్



పెద్దపల్లిరూరల్: కేక్ కట్ చేస్తున్న మనోహర్‌రెడ్డి



సుల్తానాబాద్‌లో కేక్ కటింగ్



ఓదెల: మల్లన్న సన్నిధిలో నాయకుల పూజలు

పెద్దపల్లిరూరల్/గోదావరిఖని/ధర్మారం/పాలకుర్తి/యైటింక్లయిన్‌కాలనీ/సుల్తానాబాద్/జూలపల్లి/ఎలిగేడు/రామగిరి/ముత్తారం/మంథని/కమాన్‌పూర్/ఓదెల: పెద్దపల్లి జిల్లావ్యాప్తంగా శనివారం మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను బీఆర్‌ఎస్ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. కేసీఆర్ పోరాటంతోనే రాష్ట్రం సిద్ధించిందని, ఆయన పాలనలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని పలువురు నాయకులు కొనియాడారు.

దళితబంధు నిధులు విడుదల చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న దళితులు

కమాన్‌పూర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం రెండో విడతలో ఎంపిక చేసిన దళితులకు కాంగ్రెస్ ప్రభుత్వం దళితబంధు నిధులను విడుదల చేసి అందించాలని కోరుతూ శనివారం దళితబంధు సాధన కమిటీ ఆధ్వర్యంలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం నిధులు విడుదల చేసి కలెక్టర్ అకౌంట్‌లో జమ చేశారని, అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో దళితబంధు నిధులను నిలిపివేశారన్నారు. ఎంపిక చేసిన దళితులకు నిధులు అందించి న్యాయం చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో డివిజన్ అధ్యక్షుడు ఊట్ల శ్రీనివాస్, ఆర్ల స్వామి, పొనగంటి రాజనర్సు, గద్దల శంకర్, కాదాసి తిరుపతి, కొల్లూరి తిరుపతి పాల్గొన్నారు.

కోల్ సెక్రటరీకి వినతి

గోదావరిఖని: శ్రీరాంపూర్ పర్యటనకి వచ్చిన కోల్ సెక్రటరీ అమృత్‌లాల్ మీనాను ఐఎన్‌టీయూసీ నాయకులు శనివారం కలిశారు. బొగ్గు బ్లాకులను సింగరేణి సంస్థకు కేటాయించాలని కోరారు. నాయకులు ధర్మపురి, కాంపెల్లి సమ్మయ్య, జెట్టి శంకర్‌రావు, కచ్చకాయల సదానందం ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఓదెల: నల్గొండ జిల్లా మల్లారెడ్డి గూడెంలో జరుగుతున్న రాష్ట్రకబడ్డీ పోటీల్లో మండలంలోని కనగర్తి దాసరి పద్మహన్మయ్య హైస్కూల్ విద్యార్థులు పెండం అభినయ, దొడ్డె వైష్ణవి ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను ఎంఈవో ఆరెపల్లి రాజన్న, హెచ్‌ఎం రమేశ్, పీఈటీ విష్ణు అభినందించారు.

శానిటేషన్ కొనసాగించాలి

రామగుండం: అంతర్గాం ఎంపీడీవోగా బదిలీపై వచ్చిన ఎంఏ.అలీం కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో శానిటేషన్ ప్రక్రియ నిరంతరం కొనసాగించాలని, రాబోయే వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. వివిధ విభాగాల్లో అధికారుల పనితీరు, కార్యాలయ నిర్వహణపై సమీక్షించారు. ఎంపీవో మోతె సమ్మిరెడ్డి, సూపరింటెండెంట్ మామిడాల కరుణాకర్, ఈజీఎస్ ఏపీవో రమేశ్ ఉన్నారు.